ఉస్మానియా ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్ ప్రారంభం



పెయిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్‌ను డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నొప్పి నివారణకు అధునాతన, మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రవాస భారతీయ వైద్యులు, సహ దాతల సహకారంతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహే తదితరులు పాల్గొన్నారు.



రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ చేసిన పిల్లలతో నిమ్స్ వైద్య బృందం

నిమ్స్‌లో ఇద్దరు బాలురకు అరుదైన చికిత్స

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండె దడతో వచ్చిన ఇద్దరు బాలురకు నిమ్స్ వైద్యులు అరుదైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఇద్దరు బాలురకు సుప్రావెంట్రిక్యులర్ అరిథ్మియాలకు సంక్లిష్ట రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (ఆర్ఎఎఫ్ఏ) ప్రక్రియను నిర్వహించినట్లు వివరించారు. వివరాలను నిమ్స్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఓరుగంటి సాయి సతీష్ వివరించారు. ఖమ్మంకు చెందిన 15 ఏళ్ల బాలుడు చిన్నప్పటి నుంచి తరుచూ దడతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ బాలుడిని ఇటీవల నిమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతనికి కుడి వైపు గుండె ఉన్నట్లు, థొరాక్స్ ఉదరంలోని ప్రధాన అవయవాలు వ్యతిరేక దిశలో ఉన్నట్లు గుర్తించారు. వక్రీకరించిన గుండె శరీర నిర్మాణ శాస్త్రం, చిన్న వయసు, కాథెటర్లను ఉంచడంలో ఇబ్బంది, దడకు కారణమయ్యే అసాధారణ బహుళ విద్యుత్ సర్క్యూట్ల వివరణ సవాళ్లను 3డీ ఈ మ్యాపింగ్ సహాయంతో అధిగమించారు. వక్రీభవన దడకు కారణమయ్యే మరొక సర్క్యూట్‌తో పాటు అసాధారణ అదనపు విద్యుత్ మార్గం ఆర్ఎఫ్ శక్తితో విజయవంతంగా తొలగించినట్లు ఆయన వివరించారు.

నాలుగు నెలల్లో 25 సార్లు గుండె దడ

నగరానికి చెందిన మరో 14 ఏళ్ల బాలుడు నాలుగు నెలల్లో 25 సార్లకు పైగా గుండె దడతో అస్వస్థతకు గురయ్యాడు. పలు ఆస్పత్రులను సందర్శించిన తర్వాత అతను ఇటీవల నిమ్స్‌కు వచ్చాడు. ఆ బాలుడిని పరీక్షించిన వైద్యులు మిట్రల్ వాల్వ్ దగ్గర గుండె ఎడమ వైపు అసాధారణమైన అదనపు విద్యుత్ ఉత్పత్తి చేసే సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీనిని 3డీ మ్యాపింగ్ సహాయంతో, దృష్టి రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్‌తో తొలగించినట్లు చెప్పారు. ప్రక్రియ తర్వాత ఇద్దరు బాలురు గుండె దడ నుంచి పూర్తిగా విముక్తి పొందారని, ఈ వైద్య ప్రక్రియ ఉచితంగా నిర్వహించామని డాక్టర్ సాయి సతీష్ తెలిపారు. ఈ వైద్య ప్రక్రియలో డాక్టర్ హేమంత్, డాక్టర్ సునీత, డాక్టర్ అజేయ, డాక్టర్ మౌనిక, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనురాగ్, క్యాత్ ల్యాబ్ టెక్నీషియన్లు ప్రమీల, రామారావు, నర్సింగ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ ఉన్నారు.

కిమ్స్‌లో 35ఏళ్ల మహిళకు..



కోలుకున్న మహిళతో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు

రాయదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి): థైరాయిడ్ వాపు వల్ల గుండె, ఊపిరితిత్తులు, ప్రధాన రక్తనాళాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న 35ఏళ్ల మహిళకు కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. కిమ్స్ ఆస్పత్రి థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. 35ఏళ్ల మహిళ ఊపిరి అందక ఇబ్బంది పడుతుండడంతో కుటుంబసభ్యులు ఇటీవల కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమెకు చాలా కాలంగా థైరాయిడ్ వాపు సమస్య ఉందని, అది క్రమంగా మెడ నుంచి కిందకి వెళ్లి ఎద భాగాన్ని ఆక్రమించిందని గుర్తించామని తెలిపారు. కుడివైపు ఊపిరితిత్తులు, గుండె, ప్రధాన రక్తనాళాన్ని ఆక్రమిస్తూ రెట్రోస్టెర్నల్ గాయిటర్‌గా రూపొందిందని గుర్తించామని ఆయన పేర్కొన్నారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నైపుణ్యంతో 15సెంటీమీటర్ల పొడవున్న కణితిని తొలగించామని వివరంచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని వారం రోజుల తర్వాత డిచార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ కీలకం



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్ర జ్యోతి): అత్యవసర వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ పరికరం కీలకంగా మారిందని కేర్ హాస్పిటల్స్ అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ వర్మ కె పేర్కొన్నారు. కేర్ ఆస్పత్రి బంజారాహిల్స్ ఆధ్వర్యంలో, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా (ఎస్ఈఎంఐ) ఆధ్వర్యంలో శనివారం జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ (ఎన్‌యూఎల్ఎస్) వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్‌పై వైద్యులకు శిక్షణ ఇస్తున్నామని, దీని వల్ల వారిలో నైపుణ్యం పెరుగుతుందని వివరించారు. సెమీ అకడమిక్ చెయిర్ డాక్టర్ శ్రీనత్ కుమార్ టీఎస్ మాట్లాడారు. ట్రామా, కార్డియాక్ అరెస్ట్, షాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్లను త్వరగా అంచనా వేసేందుకు అవసరమైన అల్ట్రాసౌండ్ సాంకేతికతలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో సెమీ బోర్డు అధ్యక్షురాలు డాక్టర్ సౌజన్య పట్టిబండ్ల, దేశవ్యాప్తంగా ఉన్న ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వార్డులో రోగులకు తిరిగే స్వేచ్ఛ

- జైలు శాఖ నియంత్రణలో ఖైదీ రోగులకు భద్రత
- మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్ డాక్టర్ అనిత

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): మానసిక చికిత్సాలయంలో కుటుంబ వార్డులలోని రోగులకు స్వేచ్ఛగా తిరిగే హక్కు ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. కొన్నిసార్లు వారు ఆస్పత్రి ప్రాంగణాన్ని వదిలివెళ్తారని, ఆ సమయంలో రోగులు కుటుంబసభ్యుల కస్టడీ నుంచి తప్పించుకుంటారని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురించిన 'మానసిక చికిత్సాలయం నుంచి నిత్యం రోగులు మాయం' కథనానికి ఆమె స్పందించారు. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ప్రకారం, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు కనీస నియంత్రణతో చికిత్స చేయాలని, అందుకే, కుటుంబ వార్డుల వ్యవస్థ ఉందన్నారు. ఇక్కడ కుటుంబసభ్యులు రోగిని జాగ్రత్తగా చూసుకోవడానికి వారితో పాటు ఉండటానికి అనుమతిస్తారని తెలిపారు. జైలు రోగుల కోసం ప్రత్యేకంగా ఒక భవనం ఉందని, వారి పర్యవేక్షణ, భద్రత జైలు శాఖ నియంత్రణలో ఉంటుందని వివరించారు. దూకుడుగా ఉండే రోగులను, న్యాయాధికారులు, పోలీసులు సూచించిన రోగులను మాత్రమే క్లోజ్ వార్డులో ఉంచుతామని ఆమె తెలిపారు.

నందనవనంలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు కృషి

- కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్



నందనవనంలో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ సుజాతానాయక్, అధికారులు

చంపాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానికులకు రక్షణపరంగా నందనవనంలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం, భూపేష్‌గుప్తానగర్ కాలనీలలో శనివారం జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, డీసీ సేవా ఇస్లావత్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సుజాతానాయక్‌లతో కలిసి మధుయాష్కీగౌడ్ పర్యటించారు. మధుయాష్కీగౌడ్ మాట్లాడు తూ నందనవనం బస్తీ శ్మశానవాటికలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని జెడ్సీని కోరారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. స్థానిక యువత డ్రగ్స్ బారిన పడకుండా నివారించేందు కు కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటుతో మహిళలకు పూర్తిగా రక్షణ ఉంటుందని మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్కు స్థలాల్లో పిల్లలకు ఆట వస్తువులు, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయించనున్నట్లు పేర్కొన్నారు. వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జెఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల వివాదాన్ని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దేరంగుల కృష్ణ, దుర్గయ్యగౌడ్, మెరుగు రమేష్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, లతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్‌కాలనీలో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి మధుయాష్కీగౌడ్ కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కవిత, కిరణ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈ విద్యా సంవత్సరంలో బడంగ్‌పేట్
స్కూల్ భవనం ప్రారంభించండి

- నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా చూడండి
- విద్యాశాఖ కమిషనర్‌కు పారిజాతారెడ్డి వినతి



విద్యాశాఖ కమిషనర్ మురళికి వినతిపత్రం ఇస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని గాంధీనగర్ సమీపంలో గల దావూద్‌ఖాన్‌గూడలో జీవీకే సంస్థ సీఎస్ఆర్ పథకంలో భాగంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాల నూతన భవనం నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయించడానికి చర్యలు తీసుకోవాలని బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అకునూరి మురళిని కోరారు. ఈ మేరకు శనివారం ఆమె ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ పాఠశాల భవనాన్ని రానున్న విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బడంగ్‌పేట్ పాత గ్రామపంచాయతీ కూడలిలో ఉన్న పాఠశాల ఇరుకుగా మారి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ దృష్ట్యా సదరు పాఠశాలను నూతన భవనంలోకి మార్చాల్సిన అవసరం ఉన్నదని ఆమె అన్నారు. ఇటీవల భవనం నిర్మాణం పనులు అర్థాంతరంగా ఆపేశారని, దాంతో జూన్ 12నాటికి భవనం అందుబాటులోకి వస్తుందో లేదో అని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆం దోళన చెందుతున్నారని ఆమె పేర్కొన్నారు. మిగిలిపోయిన పనులను తొందరగా పూర్తి చేయించి విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పారిజాతారెడ్డి ఆయనను కో రారు. కాగా సంబంధిత అధికారులతో, జీవీకే సంస్థ ప్రతినిధులతో మాట్లాడి భవనం నిర్మాణం పనులు తొందరగా పూర్తయ్యేలా చూస్తానని కమిషనర్ మురళి హామీ ఇచ్చినట్లు పారిజాతారెడ్డి తెలిపారు.

డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులకు రైతులు సహకరించాలి

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



రాచకాలువ సమీప రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బృందావన్ కాలనీలో సంబంధిత అధికారులు ట్రంక్‌లైన్ పనులు చేయడానికి స్థానిక రైతులు సహకరించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సదరు రైతులతో ఎమ్మెల్యే శనివారం సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు గౌరిశెట్టి మనోజ్‌కుమార్, రైతులు యాదిరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్టీఓ కిష్టయ్య

బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోవాలి

మన్సూరాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూల్స్, కళాశాలల యాజమాన్యం, డ్రైవర్లు ఆర్టీఏ నిబంధనల మేరకు బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకుని బస్సులు నడపడంతో జాగ్రత్తలు వహించాలని మలక్‌పేట ఆర్టీఓ ఎల్.కిష్టయ్య పేర్కొన్నారు. విద్యా సంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సి.రమేష్ ఆదేశాల మేరకు శనివారం నాగోల్‌లోని హైదరాబాద్ ఈస్ట్ జోన్ ఆర్టీఏ ఆధ్వర్యంలో బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ప్రతి విద్యాసంస్థల వారు బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.బలరామ్, ఆర్.రమేష్‌బాబు, ఆర్.నరేందర్‌పాల్‌సింగ్, రాధిక పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధికి చర్యలు : జెడ్సీ

చంపాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో శనివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, స్థానిక కార్పొరేటర్ సుజాతానాయక్, ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి జెడ్సీ మార్నింగ్ వాక్ నిర్వహించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మిగిలిపోయిన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం, పలు పార్కుల అభివృద్ధి, ఓపెన్‌జిమ్‌లో అదనపు పరికరాలు, బ్యాట్‌మెంటన్‌కు ఇండోర్ షెడ్ ఏర్పాటు చేయాలని కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జెడ్సీ, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ పార్కుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కాలనీలోని పార్కు, ఓపెన్‌జిమ్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దేరంగుల కృష్ణ, బి.సుబ్బారావు, ఏ.జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న యువతులు

వనస్థలిపురం : వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్‌గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్నివర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

సరూర్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని శివసాయినగర్‌కాలనీలో గల గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయం ద్వాదశ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం ఉదయం నుంచి ఆలయంలో పలు ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సిద్ధి బుద్ధితో పాటు వినాయకుడి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చి, కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, అన్నాజీరావు, వెంకటరమణ, వెంకటకృష్ణారావు, రామచంద్రారెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్యాంకుమార్, భక్తులు పాల్గొన్నారు.

పాత బకాయిలు చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలి

హయత్‌నగర్, మే 17(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం సమావేశం శనివారం సంఘం కార్యాలయంలో చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాత బకాయిలను చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలని కోరారు. కొత్తగా 11 మంది సభ్యులకు సంఘంలో సభ్యత్వం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా 9మంది రైతులకు రూ.1కోటి 25లక్షల రుణాలను మంజూరు చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, నర్సింగ్‌రావు, వంగేటి లక్ష్మారెడ్డి, స్వప్న, యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మదర్సా నుండి ఇద్దరు యువకులు పరార్

హయత్‌నగర్ : మదర్సాలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు(అన్నదమ్ములు) పరారైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఎండి ఇజ్రాయిల్ కుమారులు హబీబుల్లా (13), సఫీయుల(11) హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరు హతిగూడలోని మదర్సాలో చదువుకుంటున్నారు. ఏప్రిల్‌లో ఇద్దరు అన్నదమ్ములు బీహార్‌కు వెళ్లారు. ఇదిలా ఉండగా ఈనెల 5న ఇజ్రాయిల్ ఇద్దరు కుమారులను తీసుకొని వచ్చి మదర్సాలో వదిలి వెళ్లాడు. ఇదిలా ఉండగా 8వ తేదీన ఉదయం 9గంటలకు హబీబుల్లా అతని సోదరుడు సఫియుల్లా ఇద్దరు కలిసి మదర్సా నుంచి పారిపోయారు. ఈ విషయాన్ని మదర్సా నిర్వాకులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో మహిళకు వేధింపులు

హైదరాబాద్ సిటీ : సోషల్ మీడియా వేదికగా వేధింపులకు పాల్పడుతున్న సైబర్ నేరగాడిని హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన కూన ధర్మారావు(25) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ, దిల్‌సుఖ్‌నగర్‌లో హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇతడు నకిలీ వెబ్‌సైట్(సెక్స్ మెడిస్కో) రూపొందించడంతోపాటు నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. తమ సంస్థ నుంచి ఆన్‌లైన్‌లో పనిచేస్తే ఆదాయం వస్తుందని చెబుతూ అమాయకులను మోసం చేస్తున్నాడు. మోసం కేసులో పట్టుబడకుండా ఉం డేందుకు బిచ్చగాళ్ల వద్ద నుంచి ఆధార్, ఇతర వివరాలు తీసుకొని బ్యాంకు ఖాతాలు ప్రారంభించాడు. అమాయకుల నుంచి కాజేసిన డబ్బును ఈ బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవాడు. ఆన్‌లైన్ ఈ కామర్స్ వ్యాపారం చేస్తున్న నగరానికి చెందిన మహిళను ఇతడు ఆన్‌లైన్‌లో సంప్రదించాడు. వ్యాపారాభివృద్ధికి సహకరించేందుకు తమ ఉత్పత్తులను కొనుగోలు చేయమని ఒత్తిడి చేశాడు. దానికి మహిళ నిరాకరించడంతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలో ఆమె వాట్సప్ ఛానెల్‌లో అసభ్యకరమైన పోస్టులు, వ్యాపారాన్ని దెబ్బతీసేలా పోస్టులుపెట్టాడు. దాంతో బాధిత మహిళ సైబర్‌క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది. సైబర్ క్రైం పోలీసులు సాంకేతిక ఆధారాల ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించండి

కొత్తపేట: ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. శనివారం ఆయనతో పాటు టీటీఐ ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది రమేష్ టీటీఐ ట్రాఫిక్ చిల్డ్రన్‌పార్కు, కమిషనరేట్ పరిధిలోని 10ప్రాంతాల్లో సంస్థల సిబ్బందికి, వాహనాల డ్రైవర్లకు, యజమానులకు నిబంధనల ప్రాధాన్యతను వివరించారు.

ఘనంగా లింగమయ్య గంప జాతర



గంప జాతరను నిర్వహిస్తున్న గ్రామస్థులు

సరూర్‌నగర్, మే 17 (ఆంధ్ర జ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో లింగస్వామి జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. గ్రామానికి పడమర దిక్కున కుర్మల్‌గూడ సమీపంలో గల లింగమయ్యగుట్ట జాతర సందర్భంగా విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పుట్ట కప్పే క్రతువును నిర్వహించిన నిర్వాహకులు.. శనివారం సదరు పుట్ట మన్నును(పుట్ట బంగారంను) గంపల్లో నింపుకుని గంప జాతర నిర్వహించారు. గ్రామం నుంచి లింగమయ్య గుట్ట వరకు ఒగ్గు కళాకారుల విన్యాసాలు, డిల్లెం బల్లెం డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల నడుమ గంప జాతరను సందడిగా నిర్వహించారు.

తిరంగా ర్యాలీకి తరలిన బీజేపీ శ్రేణులు



ర్యాలీకి తరలివెళ్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, నాయకులు

కొత్తపేట, మే 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర శాఖ నగరంలోని ట్యాంక్‌బండ్‌పై శనివారం చేపట్టిన తిరంగా ర్యాలీకి కొత్తపేట డివిజన్ పార్టీ కార్యాలయం నుంచి పెద్ద సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, సుందర్‌నారాయణ, వెంకట్‌రెడ్డి యువకులు, మహిళలు మువ్వన్నెల జాతీయ జెండా చేత పట్టుకుని భారత్ మాతాకీ జై అంటూ ముందుకు సాగారు.

వనస్థలిపురం : ఆపరేషన్ సిందూర్ వీరవిజయాన్ని స్మరించుకోవడానికి భాగ్యనగర సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో దేశ సైనికుల గౌరవార్థమై చేపడుతున్న చలో ట్యాంక్‌బండ్ తిరంగా ర్యాలీకి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తరలివెళ్లారు. బీజేపీ నాయకులు కొంతం నవకిషోర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, రఘురామ్‌నేత పాల్గొన్నారు.

సైదాబాద్ : మన దేశ సైనికులకు మద్దతుగా ట్యాంక్‌బండ్‌పై చేపట్టిన తిరంగా ర్యాలీకి సైదాబాద్, ఐఎస్‌సదన్, కుర్మగూడ, అక్బర్‌బాగ్ డివిజన్ల నుంచి భారీ సంఖ్యలో బీజేపీ నేతలు, కార్యకర్తలు, పలు కాలనీ, బస్తీ సంఘాల ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ ర్యాలీలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, కొత్తకాపు అరుణారెడ్డి, నేతలు వీరేందర్ యాదవ్ లింగాల హరిగౌడ్, రమణ్‌సింగ్ పాల్గొన్నారు.

వంటగది కిటికీలో నుంచి చొరబడి ఇంట్లో చోరీ

- 75తులాల బంగారు నగలు, రూ.2.50లక్షల నగదు అపహరణ



చోరీకి పాల్పడింది ఈ కిటికిలో నుంచే

చాదర్‌ఘాట్, మే 17(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆజంపురలో గల మలక్‌పేట రైల్వే స్టేషన్‌ను ఆనుకుని ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో గల మొదటి అంతస్తులో శుక్రవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. చాదర్‌ఘాట్ పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆజంపురలోని అద్దె ఇంట్లో మొదటి అంతస్తులో నివాసముంటున్న మహ్మద్ ఫహీముద్దీన్ ఏఎ్ఎరావునగరంలోని జేయింట్ హోటల్‌లో మెయిన్‌టెనెన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఫహీముద్దీన్ అతని కుమార్తె కలిసి ఇంట్లో వేర్వేరు గదుల్లో నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు వీరి ఇంటి వెనుక వైపు ఉన్న మలక్‌పేట రైల్వేస్టేషన్ నుంచి వంట గది కిటికీలో నుంచి చొరబడ్డారు. మొదట్లో చేతికందిన వంట సామగ్రిని చోరీ చేసేందుకు ఒక్కొక్కటిగా కిటికీలో నుంచి రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం వైపు పారవేశారు. అనంతరం బెడ్‌రూంలో నిద్రిస్తున్న ఫహీముద్దీన్ గదిని బయటి నుంచి బిగించారు. అతని పక్కనే పెట్టుకున్న మొబైల్ ఫోన్‌ను చోరీ చేశారు. అనంతరం మరో బెడ్‌రూంలో ఉన్న బీరువా పక్కనే ఉన్న తాళాలతో బీరువా తెరచి బంగారు నగలు, నగదును చోరీ చేశారు. బాధితులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్ తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. రూ. 2.50లక్షల నగదు, 75తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రంగంలోకి క్లూస్ టీమ్..

చోరీ జరిగిన విషయం తెలియగానే చాదర్‌ఘాట్ క్రైం ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ తన సిబ్బందితో క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. చోరీ జరిగిన వివరాలు సేకరిస్తున్నారు. వేలి ముద్రలను సేకరించారు.

8 బృందాలతో గాలింపు చర్యలు

భారీ చోరీకి పాల్పడిన దొంగలను గుర్తించేందుకు సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు 8 బృందాలను రంగంలోకి దింపినట్లు మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు. చాదర్‌ఘాట్ పోలీసులతోపాటు మలక్‌పేట డివిజన్ నుంచి ఆరు టీమ్‌లను, సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిపి 8 బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ కొశిక మల్లయ్య, తండ్రి: పెంటయ్య, వయసు: 58 సం.రాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: ఇంటి నెంబర్. 4-105/6/4 శ్రీరామ్ నగర్ కాలనీ, తుర్కాయంజాల్ మున్సిపాలిటీ, రంగా రెడ్డి జిల్లా గారి మేరకు ఈ క్రింది బహిరంగ ప్రకటన చేయుచున్నాను.

నా క్లయింట్ అబ్దుల్లాపూర్ మెట్ మండల్, తుర్కాయంజాల్ యందు కమ్మగూడ గ్రామం యందు గల Sy. No. 242ఈ భూమికి Ac.0.34 gts భూమికి పట్టాదారుడు. అట్టి భూమి నా క్లయింటుకు వారసత్వంగా సంక్రమించింది. అయితే నా యొక్క క్లయింటుకు చుట్టు పక్కల ఉన్న భూముల దగ్గరలో ఉన్న యాజమానుల భూములను కొనుగోలు చేసి, అక్రమంగా, దౌర్జన్యంగా నా క్లయింటు యొక్క భూమిని కలుపుకొని, ప్రభుత్వ అధికారులను మోసం చేసి, అక్రమ లే అవుట్ ను పొంది ఉన్నారు.

ఇట్టి అక్రమ లే అవుట్ కాన్సిల్ చేయాలని మరియు నా క్లయింటు యొక్క భూమిలోకి రావద్దని, గౌరవ జూనియర్ సివిల్ జడ్జ్, హయత్ నగర్, రంగా రెడ్డి కోర్టులో ఇంజంక్షన్ దావా OS.No. 335/2023 దానిని నా క్లయింట్ వేయడం జరిగింది. అంతేకాక ఇట్టి అక్రమ లే అవుట్ ను రద్దు చేయమని, గౌరవ హై కోర్టు ఆఫ్ తెలంగాణ యందు Writ Petition ను వేయుట జరిగింది. అవి పెండింగులో ఉండగా నా క్లయింటు యొక్క భూమిని తన ప్రతివాదులైన 1) గుర్రం రామకృష్ణ రెడ్డి, 2) బండి అశోక్, 3) బన్నే బీరప్ప, 4) గుండా మహేశ్, అనువారు అందరూ కలిసి అక్రమ లే అవుట్ ను చూపించి నా క్లయింటు భూమిని అమ్ముటకు ప్రయత్నిస్తున్నారని తెలియవచ్చెను. అట్టి Sy. No. 242 ఈ కూడా అక్రమ లే అవుట్ లు. నా యొక్క క్లయింటు ఒక ఎకరం భూమికి యజమానులు, మరియు నా యొక్క క్లయింటు భూమిపై ఎలాంటి క్రయవిక్రయాలు చేయరాదని, అలా చేసినచో అవి మా క్లయింటుకు సంబంధం లేదని తదుపరి, సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును అని హెచ్చరించడమైనది. ఇట్టి భూమి యొక్క హద్దులు: ఉత్తరం : ప్రతివాదులు, దక్షిణం: ప్రతివాదులు, తూర్పు: ప్రతివాదులు, పడమర : రోడ్

రాపోలు భాస్కర్ (న్యాయవాది)
O/o. ఇంటి నం. 16-2-740/7 రోడ్ నెంబర్. 1, కల్యాణ్ నగర్, గడ్డి అన్నారం, దిల్ సుఖ్ నగర్, హైదరబాద్ - 500060.
సెల్: 9848498029

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786